క్లుప్తంగా

మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీకి 24 సంవత్సరాలుగా ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాల్వ భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కాల్వ ప్రకాశరావు, కొత్తపల్లి సోమయ్య, రాజేంద్రకుమార్, కటుకూరి వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో బుధవారం కొత్తగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐఓ) మనోహర్ వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని మట్టి ట్రాక్టర్‌ను సీజ్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రేపు దుకాణాలకు వేలంపాట

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలోని నాలుగు వ్యాపార దుకాణాలకు, తలనీలాలు పోగు చేసుకునేందుకు, చీరల సేకరణ, ఆలయప్రాంగణంలో పూలదండలు విక్రయించుకునేందుకు, ఫొటోలు తీసుకునేందుకుగాను 11 నెలల కాలపరిమితికి లైసెన్స్ హక్కులు పొందడానికి, పూలదండలు సప్లై, టికెట్ బుక్స్, వాల్ పోస్టర్ల ప్రింటింగ్, ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రింటింగ్, లైటింగ్, డెకరేషన్, రంగులు, సున్నాలు సప్లై చేయుటకు ఒక్క సంవత్సర కాలపరిమితికి ఈనెల 12వ తేదీన టెండర్, బహిరంగ వేలంపాటలను నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

ఇల్లెందురూరల్: సీజనల్ జ్వరాలు ప్రబలుతున్నందున పల్లెల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామాలలో దోమల ఉత్పత్తికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయిల్‌బాల్స్ వేయాలని, ఫాగింగ్ పనులు సత్వరమే ప్రారంభించాలని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున వనమహోత్సవ పనులు వేగవంతం చేయాలని, మిషన్ భగీరథ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలని చెప్పారు.

జీఓ 22 అమలు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ అన్నారు. బుధవారం రైటర్ బస్తీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, ప్రతీ కాంట్రాక్ట్ కార్మికుల పిల్లలకు కూడా సింగరేణి స్కూల్‌లో ఫ్రీ ఎడ్యుకేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అర్ధనగ్న ప్రదర్శన

కొత్తగూడెంరూరల్: నా ఉద్యోగం నాకు ఇప్పించి.. నా కుటుంబాన్ని ఆదుకోవాలని 104 డ్రైవర్ శంకర్ బుధవారం కొత్తగూడెం పోస్టాఫీసు నుంచి బస్టాండ్ వరకు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. మాట్లాడుతూ... సమాచర హక్కు చట్టం ఉపయోగించుకొని 104 సంబంధించిన వివరాలు సేకరించే క్రమంలో ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో నా కుటుంబం వీధిన పడింది. దయచేసి నా ఉద్యోగం నాకు ఇప్పించాలని కోరుతున్నాడు.

వైద్యశిబిరానికి స్పందన

పాల్వంచ: కేఎల్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ కాటిరెడ్డి లక్ష్మారెడ్డి 57వ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్వంచలోని కేఎల్ఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు కేఎల్ఆర్‌కు నివాళులర్పించారు. అనంతరం ఫార్మసీ కళాశాల ఆవరణలో ఖమ్మం కిమ్స్, హైదరాబాద్ సన్‌షైన్ ఆస్పత్రుల సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌కు కుర్చీలు, సౌండ్ సిస్టమ్, టేబుళ్లు అందజేశారు. కేఎల్ఆర్ విద్యాసంస్థల చైర్‌పర్సన్ నాగమణి, డైరెక్టర్ సిద్ధార్థరెడ్డి, సింధు, వై.మధు, మురళీ ప్రసాద్, కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

జూలూరుపాడు: వర్షాలు కురుస్తుండటంతో విషజ్వరాలు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా అన్నారు. బుధవారం జూలూరుపాడులో మాట్లాడారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి, మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. డెంగీ, మలేరియా, విషజ్వరాలు రాకుండా బ్లీచింగ్ చల్లించడం, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి పెరిగిందన్నారు. జూలూరుపాడు ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. పసుపులేటి పవన్, కొండా హనుమంతరావు, బడుగు మౌళి, వంశీ, నాగయ్య పాల్గొన్నారు.

శిథిల భవనాల్లో 'సర్కార్' చదువులు



- భయంభయంగా గడుపుతున్న విద్యార్థులు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



ప్రమాదకరంగా ఉన్న వెనకతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం
(ఇన్‌సెట్) మాచినేనిపేట తండాలో శిథిల భవనంలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న భవనాల్లో చిన్నారులు చదువులు కొనసాగిస్తున్నారు. మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ప్రాథమిక పాఠశాలలు 37, గిరిజన ప్రాథమిక పాఠశాలలు 6, యూపీఎస్‌లు 5, హైస్కూల్స్ 5, కేజీబీవీ–1, ఏజీహెచ్‌ఎస్–1 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, పాఠశాల విద్యను అభివృద్ధి పరిచేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమం కింద 17 పాఠశాలలను అభివృద్ధి పరచగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ– ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో కింద 25 పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. అయినా వెనకతండా, మాచినేనిపేటతండా, రేగళ్ల తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఆ రెండు పథకాలకు నోచుకోలేదు. వీరభద్రాపురం, పుల్లుడు తండా ప్రాథమిక పాఠశాలల్లో ఆరుగురు విద్యార్థులు కంటే తక్కువగా ఉండటంతో పథకాలు వర్తించలేదు. పాఠశాలల భవనాలు అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో విద్యార్థులు భయంభయంగా చదువులు కొనసాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ఎప్పుడు ముంచుకోస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వెనకతండాలోని ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. 30 ఏళ్ల నాటి పాఠశాల భవనం శిథిలం కావడంతో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. 12 ఏళ్లుగా చెట్ల కింద చిన్నారులు చదువులు కొనసాగించాల్సి వస్తోంది. ఇదే గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఏడాదిన్న క్రితం రూ.1 లక్ష ఆర్థిక సాయం చేయడంతో రేకుల షెడ్ నిర్మించారు. ప్రస్తుతం రేకుల షెడ్‌లో పాఠశాల నడుస్తుండగా, అంగన్‌వాడీ కేంద్రం మాత్రం శిథిలావస్థ భవనంలోనే నడుపుతున్నారు. మాచినేనిపేటతండా పాఠశాలలో 25 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. 45 ఏళ్ల క్రితం నిర్మించిన శిథిలావస్థ భవనంలో తరగతులు కొనసాగుతున్నాయి. గత ఏడాది ఇదే పాఠశాలలో 31 మంది విద్యార్థులు చదువుకున్నారు. వర్షం వస్తే స్లాబ్ కురవడం, గోడలు నుంచి చెమ్మ దిగడంతో విద్యార్థులు తడిలోనే కూర్చోవాల్సి రావడంతోపాటు, స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు భయంతో వణికిపోతున్నారు. రేగళ్లతండా ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులు, ఒక టీచర్ ఉన్నారు. పాఠశాల భవనం స్లాబ్ దెబ్బతినడంతోపాటు, గోడలు బీటలు బారాయి. వర్షం వచ్చిన రోజు ఆయా పాఠశాలల ఆవరణంలో వరదనీరు చేరుతుండడంతో సెలవు ఇవ్వాల్సి వస్తోంది. జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతినడంతో మన ఊరు – మన బడి కార్యక్రమం కింద నిధులు మంజూరైతే నూతన భవనాన్ని నిర్మించి ఏడాదిన్నర అవుతోంది. కానీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు ఎంఈఓ గుగులోత్ వెంకట్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలిపారు.

బడి నిర్మించండి..



తరగతి గదిలో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండటంతో చెట్టు కింద, రేకుల షెడ్‌లో కూర్చోని చదువుకోవాల్సి వస్తోంది. కొద్దిపాటి వాన వచ్చినా పాఠశాలలోకి వరద చేరుతోంది. కలెక్టర్ గారు మా బాధలు అర్థం చేసుకొని కొత్త భవనాన్ని నిర్మించండి.

– సాయి జీవన మహదేవ్, విద్యార్థి

భవనం నిర్మించాలి..



పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలి. భవనం స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండటంతో చెట్లు, తాత్కాలికంగా నిర్మించిన రేకుల షెడ్‌లో విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెప్తున్నాం. వర్షం వస్తే పాఠశాలకు సెలవే. నూతన భవనాన్ని నిర్మించాలి.

– కె.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం వెనకతండా

భయంభయంగా గడుపుతున్నాం..



పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతిన్నది. ఏ ప్రమాదం జరుగుతోందని భయంగా ఉంది. 25 మంది పిల్లలు, టీచర్లు ఇద్దరం ఉన్నాం. తాగునీటి సమస్య వల్ల పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నూతన భవనాన్ని మంజూరు చేయాలి.

– ఎస్ లలిత, హెచ్‌ఎం, మాచినేనిపేటతండా

హామీలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కిసాన్ మోర్చా నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట రైతుల హామీలు, సమస్యలపై నిరసన తెలిపి అనంతరం వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు 200 రోజులు గడుస్తున్నా రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయిందన్నారు. తెలంగాణలో రైతులు వరుసగా ఆత్మహత్యల పాలవుతున్నా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాత్రం కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల వ్యవసాయ రుణమాఫీ తక్షణమే చేయాలని, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో సాగు చేస్తున్న ప్రతీ ఎకరాకు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి రమేష్, తాటిపాముల ఐలయ్య, మడివి రవి, ముసుగు శ్రీనివాసరెడ్డి, పొన్నం భిక్షపతి, గోళ్లకోటి త్రినాథ్‌రావు, గొట్టిపోల్ల శ్రీనివాసరావు, పానిశెట్టి వెంకటేశ్వర్లు, ఏనుగుల వెంకటరెడ్డి, ముసలయ్య, పోడియం బాలరాజు, నోముల రమేష్, కేశగాని శ్రీనివాస్ గౌడ్, బిట్రగుంట క్రాంతికుమార్, మాలోత్ గాంధీ, చంద్రశేఖర్, గూగుల్ శేఖర్, బాలాజీ, క్రాంతి, రామారావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ గెలిచినందుకే 'గుర్తింపు'లో జాప్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గెలినందుకే యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వటంలో జాప్యం చేస్తోందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, అదనపు కార్యదర్శి మిరియాల రంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై తాము రాష్ట్ర ఇంధన శాఖ, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కతో చర్చించామని, ఈ వారం రోజుల్లో గుర్తింపు పత్రం అందజేయకపోతే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన చేయనున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న క్రమంలో సింగరేణిని రాష్ట్ర ప్రభుత్వం ఏటీఎంగా వినియోగించుకుందని, రూ.29 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, ఏఐటీయూసీ వస్తే వాటిని నిలదీస్తుందనే భయంతో యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వటంలో జాప్యం చేస్తోందని పేర్కొన్నారు.

నీట్ కౌన్సిల్‌ను రద్దు చేయండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): నీట్ కౌన్సిల్‌ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏఓ గన్యాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రణయ్‌కుమార్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి మోకాళ్ల రమేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది సుమారు 24 లక్షల మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి నీట్ రాశారని తెలిపారు. ఫలితాలలో అవకతవకలు ఉన్నాయని అనుమానం వచ్చిన కొందరు విద్యార్థులు కోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. ప్రశ్నపత్రం లీక్ అయిందని తెలిసినా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నీట్ కౌన్సిల్‌ను యథావిధిగా కొనసాగించడంపై విద్యార్థి, యువజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు.

సుప్రీంకోర్టు కౌన్సిల్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించినప్పటికీ నిర్వహించడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రాల వారీగా వైద్య రంగ ప్రవేశ పరీక్షలు నిర్వహించే బాధ్యతలను అప్పగించాలని రాష్ట్రాలకే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.భానుచందర్, ఉపేందర్, ప్రియాంక, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేస్తాం..



జనక్ ప్రసాద్‌తో ఐఎన్‌టీయూసీ నేతలు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ బుధవారం హైదరాబాద్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. రజాక్ మాట్లాడుతూ... చాలాకాలంగా ఐఎన్‌టీయూసీలో బాధ్యతలు నిర్వహిస్తున్నందున వేతనాల సలహా మండలి చైర్మన్‌గా నియమించటం జరిగిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రికి, ఐటీ, రెవెన్యూశాఖ మంత్రులకు అభినందనలు తెలిపారు. అసంఘటిత కార్మికులకు న్యాయం చేకూరేలాగా ఈ పదవిలో వారు న్యాయం చేస్తారని తెలిపారు. బి.రాజేశ్వరరావు, గోపు కుమారస్వామి, చిలకరాజయ్య, ఎండీ సత్తార్‌పాషా, కుమార్ పాల్గొన్నారు.

నేడు విశ్వనాథం సంతాపసభ

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ జిల్లా నాయకుడు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు ఎల్.విశ్వనాథం ఈనెల 1న ఆకస్మిక మరణం పొంది విప్లవోద్యమానికి తీరని లోటు మిగిల్చారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి భూక్యా హర్జ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బద్దు తండా గ్రామంలో ఎల్వీ సంతాప సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... గురువారం జరగనున్న సంతాపసభకు అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి ఈ సభను జయప్రదం చేయాలని కోరారు.

గొత్తికోయలకు చేయూత

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల పంచాయతీలోని గంగమ్మ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి కొల్లి ఫౌండేషన్ సహకారంతో రూ.35 వేలు వెచ్చించి, మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కల్పన సందర్శించారు. మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలోని అంగన్‌వాడీ పిల్లలకు ఫౌండేషన్ చేయూతను అందిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్ బానోత్ జ్యోతి, లగడపాటి రమేష్ చంద్, మడకం సోని ఉన్నారు.

ఎల్లో, రెడ్ కార్డ్ విధానాన్ని రద్దు చేయండి



మాట్లాడుతున్న కృష్ణ

సింగరేణి(కొత్తగూడెం): ఎల్లో, రెడ్ కార్డ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, కార్మిక సంఘాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అనేక పోరాటాలు చేస్తూ ఇబ్బందులలో ఉన్న కార్మికవర్గానికి సపోర్ట్‌గా నిలవాల్సిన యాజమాన్యం ఈ సమయంలో ఇటువంటి సర్క్యులర్ జారీ చేయటం సరైంది కాదన్నారు. కార్మికులు సూపర్‌వైజర్స్ మీద క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఎల్లో, రెడ్ కార్డుల విధానాన్ని విరమించుకోవాలని, ఈ విధానం వలన సింగరేణిలో పారిశ్రామిక అశాంతి నెలకొనే ప్రమాదం ఉందన్నారు. ఆరునెలలుగా మైన్స్ సేఫ్టీ కమిటీ మీటింగ్‌లు లేవు, ఏరియా సేఫ్టీ కమిటీ మీటింగ్‌లు లేవు, రీజియన్ కమిటీ మీటింగ్‌లు లేవు, సేఫ్టీ మీటింగ్‌లు లేకుండా కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన



ఇల్లెందు: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: మొబైల్ ఫోన్లలో మెస్సేజ్‌లను క్లిక్ చేసి తమ బ్యాంకు అకౌంట్లలో డబ్బు పోగొట్టుకోవద్దని డీఎస్పీ ఎన్.చంద్రభాను కోరారు. బుధవారం ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాట్సాప్, గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఎక్స్ యాప్‌లతో పాటు మెస్సెంజర్, ఇన్‌స్టాగామ్‌లలో వచ్చే మెస్సేజ్‌లను మెయిల్ అడ్రస్‌లను ఇతర సామాజిక మాధ్యమాలలో గుర్తు తెలియని వ్యక్తులు పంపే సమాచారాన్ని క్లిక్ చేయవద్దన్నారు. ఎవరికైనా ఇలాంటి పొరపాటు జరిగితే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు. యువత డ్రగ్స్ బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారని, ఆరోగ్యాలు, కుటుంబాలు నష్టపోతాయని తెలిపారు. 18 ఏళ్ల లోపు పిల్లలు బైక్, వాహనం నడిపితే రోడ్డు ప్రమాదానికి గురైతే వాహనం యజమాని మీద కేసు నమోదు అవుతుందన్నారు. జులై 1 నుంచి కొత్త చట్టాలు వచ్చాయని కఠినంగా అమలులో ఉన్నట్లు చెప్పారు. సీఐ బత్తుల సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు మీద దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రామలింగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ తోర్తి జాన్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

ఇల్లెందురూరల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ పిలుపునిచ్చారు. కళాశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే తమ ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. దీనికోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీ ఏర్పాటు చేసిందని చెప్పారు. మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీ కన్వీనర్ డాక్టర్ చేకూరి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజు, ఐక్యూ కోఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం నూతన నేర చట్టాలు, మాదకద్రవ్యాలు, మహిళల భద్రత, బాల్య వివాహాలు, ట్రాఫిక్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. జూలై 1 నుంచి కొత్త నేర చట్టాలు అమలులోకి వచ్చాయని చెప్పారు.

ఉచిత శిక్షణ కోర్సులపై సమీక్ష



మాట్లాడుతున్న ఏజీఎం శ్రీనివాసరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సేవా సమితి ద్వారా ఇచ్చే శిక్షణ కోర్సులపై బుధవారం సేవా కోఆర్డినేటర్లతో జీఎం పర్సనల్ కార్యాలయంలో ఏజీఎం పర్సనల్ కోడూరు శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ... 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కార్పొరేట్ సేవా సమితి ద్వారా సింగరేణి పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ, యువకులకు సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ ఇచ్చే కోర్సుల వివరాలపై చర్చించారు. ఆసక్తిగల నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, మగ్గం, బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, డీటీపీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ప్రీ ప్రైమరీ టీచర్స్ కోచింగ్ కోర్సులను ఎంపిక చేసుకొని వాటిని నేర్చుకునేందుకు ఎంపిక చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలన్నారు. టి.శ్రీనివాస్‌రావు, ఇజాజ్ షరీఫ్, మునీల, సుజాత, మీనాకుమారి, పుష్పలత, రమాదేవి, హిమబిందు, అరుణ, స్వర్ణలత, వహిద, దీప పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలి



చుంచుపల్లి: నిరసన తెలుపుతున్న నాయకులు

చుంచుపల్లి: మండల టీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్ వద్ద డీఎస్సీ పరీక్ష తేదీని పొడిగించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... అభ్యర్థుల చదువుకునే వెసులుబాటు లేకుండా, సమయం ఇవ్వకుండా, టెట్ పరీక్ష రాసిన నెలరోజుల వ్యవధిలోనే మొక్కుబడిగా విద్యార్థులకు ఈ డీఎస్సీ పరీక్ష నిర్వహించటం దారుణమన్నారు. ఈనెల 15 నుంచి తలపెట్టిన పరీక్ష తేదీలకు మూడు నెలల గడువును ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంకుబాపన అనుదీప్, బొమ్మిడి శ్రీకాంత్ యాదవ్, ముత్యాల రాజేష్, కొప్పరి నవతన్, రాందాస్ నాయక్, మహమ్మద్ జాహిద్, బాచి, రవి నాయక్, శ్రీకాంత్ నాయక్, గంగాధర్, షోయబ్, అహ్మద్, మోహిన్, పూర్ణచందర్ నాయక్, లక్పతి, రవి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షలను రద్దు చేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరుతూ టీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకులు బుధవారం తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలి



ఇల్లెందురూరల్: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



పాల్వంచ: సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కొత్తగూడెంలోని తహసీల్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరన్న మాట్లాడుతూ... దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు కార్మికుల కోర్కెల దినం (డిమాండ్స్ డే) సందర్భంగా ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్‌కు అప్పగిస్తూ దేశాన్ని లూటీ చేస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్కీం వర్కర్లను విస్మరిస్తూ వారిచే వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం అమలు చేయకుండా శ్రమదోపిడీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాజారావు, దుర్గమ్మ, కళావతి, శైలజ, రత్నకుమారి, జుబేదా, సునీత, పద్మ, వాణి, రమణ, రమేష్, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాపాడాలని సీఐటీయూ మండల కార్యదర్శి తాళ్లూరి కృష్ణ కోరారు. బుధవారం ఇల్లెందులో సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. 54 డిమాండ్లు ఉన్న కార్మికుల హక్కులను నాలుగు చట్టాలకు కుదించారని ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్, స్కీం వర్కర్ల వేతనాలు సక్రమంగా అమలు చేయటం లేదని ఆరోపించారు. సాధినేని వెంకటేశ్వరరావు, మరియ, సుల్తానా, ఆలేటి కిరణ్, మోహన్‌రావు, సంధ్య, నాగరాజు, యాకమ్మ, చంద్రకళ, సునీత పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నేత కడుదుల వీరన్న, ఈసం రాణి, శకుంతల, జయ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రం నుంచి తహసీల్ వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ నాగభవానీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు ముందుకెళ్తోందన్నారు. ఆశా వర్కర్లకు పరీక్ష రద్దు చేసి కనీస వేతనాలు నిర్ణయించాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, ఐకేపీ వీఓఏ, వైద్య ఆరోగ్య రంగంతో పాటు వివిధ స్కీంలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇల్లెందురూరల్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడాలని సీఐటీయూ మండల కార్యదర్శి తాళ్లూరి కృష్ణ డిమాండ్ చేశారు. కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే 54 కార్మిక చట్టాలను నాలుగింటిగా కుదించిందని ఆరోపించారు. ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఆలేటి కిరణ్, సుల్తానా, మన్నెం మోహన్ రావు, సంధ్య, నాగరాజు పాల్గొన్నారు.

పాల్వంచ: కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని, దీనిపై ఐక్యంగా కార్మికవర్గం పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ పాల్వంచ పట్టణ కన్వీనర్ కె.సత్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామంటూ ప్రకటించిన విధానంపై పోరాడతామన్నారు.

పాల్వంచరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసే విధంగా చేసిన చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.